ప్రజాశక్తి





పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

పల్లెలు వదిలి.. పట్టణాలకు...

- గ్రామాలకు గ్రామాలు వలస బాట
- నివారణలో అధికారుల చోద్యం
- ఊసే లేని సీజనల్ హాస్టళ్లు
- వారాల తరబడి పెండింగ్‌లో ఉపాధి వేతనాలు

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ మండలంలో తీవ్రమైన అతివృష్టి, అనావృష్టి పరిస్థితుల రీత్యా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు, పేదలు సుదూర ప్రాంతాలకు వలసల బాట పడుతున్నారు. వలసల నివారణలో ప్రభుత్వం, అధికారులు ఘోరంగా వైఫల్యం చెందుతున్నారు. దేవనకొండ మండలంలో సరైన పనులు లేక కుటుంబాలు గడవక గ్రామాలకు గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.

మండలంలోని ఆయా గ్రామాల్లో వ్యవసాయ పనులు లేకపోవడంతో పేదలు, కూలీలు పొట్ట చేత పట్టుకొని తెలంగాణలోని నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, గుంటూరు, కర్ణాటక తదితర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారు. ఆయా ప్రాంతాలోల పత్తి, మిరప కోతలకు, హైదరాబాద్, బెంగళూరు, ముంబై వంటి నగరాల్లో భవన నిర్మాణ పనులకు తట్టా, బుట్టతో కుటుంబాలతో కలిసి వెళ్తున్నారు. ఇప్పటికే మండలంలో పి.కోటకొండ, తెర్నేకల్, దేవనకొండ, నేలతలమర్రి, బంటుపల్లి, చెల్లెలచెలిమల, బేతపల్లి, కుంకనూరు, పల్లెదొడ్డి, బేతపల్లి, పొట్లపాడు, గుండ్లకొండ, గుడిమిరాళ్ల తదితర గ్రామాల నుండి వందల సంఖ్యలో వలసబాట పట్టారు. పాఠశాలలో చదువుకునే పిల్లలను సైతం తల్లిదండ్రులు వెంట తీసుకెళ్తున్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మండలంలో సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేయడంలో పాలకులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యారు. వలసల నివారణకు వెంటనే ఉపాధి హామీ పనులు కల్పించాలని, పెండింగ్‌లోని హంద్రీనీవా సాగు నీటి పంట కాలువ నిర్మాణాలు పూర్తి చేయాలని, సాగు నీరు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



పిల్లలతో కలిసి వలస వెళ్తున్న కూలీలు

వలసలు నివారించి కూలీలను ఆదుకోవాలి



మండలంలో వ్యవసాయ కూలీలు దూర ప్రాంతాలకు వలసలు వెళ్లకుండా తక్షణమే ఉపాధి పనులు చేపట్టాలి. ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలు విడనాడాలి. సీజనల్ హాస్టల్ ఏర్పాటు చేసి గ్రామాల్లో పాఠశాలల్లోని బాల బాలికలు వలసలు వెళ్లకుండా నివారణ చర్యలు చేపట్టాలి.

-వీర శేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు.

ఉపాధి పనుల కల్పనకు చర్యలు



మండలంలో ఉపాధి హామీ పథకం పనుల కల్పనకు చర్యలు చేపట్టాం. కూలీలు వలసలు వెళ్లకుండా ఉండాలి.పని అడిగిన ప్రతి కూలీకి పనులు కల్పిస్తాం. ఉపాధి హామీ పథకం సిబ్బందితో పనులు కల్పించేందుకు చర్యలు వేగవంతం చేస్తాం.

- రాజు నాయక్, ఎపిఒ.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

- పదవ తరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించాలి : కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి - చిప్పగిరి

జీవితాన్నే మార్చగలిగే శక్తి ఒక్క చదువుకే ఉందని, చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి విద్యార్థులకు సూచించారు. మంగళవారం చిప్పగిరిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులతో అరగంట పాటు టీచింగ్ చేశారు. విద్యాబోధన, వసతులు ఎలా ఉన్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి కారం కొద్ది వరకు కారం తగ్గించాలని నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. అనంతరం టాయిలెట్లను పరిశీలించారు. తాగునీటి వసతిపై మినరల్ వాటర్ మిషన్ మరమ్మతులు ఎందుకు చేయించుకోలేదని హెచ్ఎంను ప్రశ్నించారు. వెంటనే మరమ్మతులు చేయించి మినరల్ వాటర్‌ను విద్యార్థులకు అందివ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం డిఇఒ శ్యాముల్ పాల్ ఆధ్వర్యంలో విద్యాబోధన, వసతులపై ఉపాధ్యాయ సిబ్బందితో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చదువుపై ఏకాగ్రత ఉంటేనే పరీక్షలలో మంచి ఉత్తీర్ణత సాధిస్తా రన్నారు.

ప్రభుత్వాసపత్రి పరిశీలన : చిప్పగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, కాన్పుల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో అందుతున్న సేవలను డిఎంహెచ్ఓ భాస్కర్ కలెక్టర్‌కు వివరించారు. ఆస్పత్రిలో అందిస్తున్న మందులను పరిశీలించి కాలం చెల్లినవి ఆసుపత్రిలో నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించి కాన్పుల వివరాలను డాక్టర్ అఫ్రోజ్ జహన్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయానికి విధుల్లో ఉండాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అనంతరం వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి డాక్టర్ రంగనాథ్ బాబు, ఎంపిడిఒ అల్లా బకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, డిప్యూటీ ఎంపిడిఒలు నాగరాజు, శ్రీనివాసరెడ్డి, ఎంఈఓలు సావిత్రమ్మ, ఫరూక్, ఏవో శ్రీరామ్ ప్రవీణ్, పిఆర్ఏఈ సోమప్ప, సర్పంచి దాసరి గోవింద రాజులు, ఎపిఎం శివయ్య, ఏపీవో జుబేర్ అహ్మద్, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ వెంకట రమణి, హెచ్ఎం లతీఫ్, సిహెచ్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ అధికారి కుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

9, 10న కర్నూలు బాలోత్సవం

- పిల్లల పండగను విజయవంతం చేయండి
- లోగో ఆవిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

కర్నూలు నగర శివార్లలోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో ఈ నెల 9, 10న నిర్వహించే కర్నూలు బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య, అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ కోరారు. కర్నూలు ఎ క్యాంప్ మాంటిస్సోరి పాఠశాలలో మంగళవారం బాలోత్సవం లోగో ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్నూలు బాలోత్సవం గౌరవాధ్యక్షులు జి పుల్లయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో గడిపే సమయం లేకపోవడం వల్ల పిల్లలు ఫోన్‌లు, ట్యాబ్‌లకు బానిసలవుతున్నారన్నారు. మార్కులు, ర్యాంకులు, సీట్లు అనే పద్ధతిలో విద్యాసంస్థలు ఉంటున్నాయన్నారు. పిల్లలను కంట్రోల్ చేసుకోవడం టీచర్లకు పెద్ద సమస్య అయిందన్నారు. పిల్లలపై జాగ్రత్త వహించకపోతే వారి మానసిక ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారుతుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో బాలోత్సవం లాంటి కార్యక్రమాల్లో పిల్లలు పాల్గొనేలా చేయడం మంచి పరిణామమన్నారు. బాలోత్సవం ద్వారా కొంత మందైనా సెల్‌ఫోన్ నుంచి దూరంగా ఉండటానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. 5వ బాలోత్సవం మంచి వాతావరణంలో దిగ్విజయం కావాలని ఆకాంక్షించారు. బాలోత్సవం అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ మాట్లాడుతూ మానసిక ఒత్తిడి నుంచి విద్యార్థులు బయట పడేందుకు బాలోత్సవం దోహదం చేస్తుందన్నారు. అకడమిక్, కల్చరల్ కార్యక్రమాలతో పండగ వాతావరణంలో బాలోత్సవం నిర్వహించనున్నామని తెలిపారు. 2 వేల మందికి పైగా పిల్లలతో ఈ సంబరం జరపనున్నామని చెప్పారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె.స్వాతి మాట్లాడుతూ గత బాలోత్సవం స్ఫూర్తితో పిల్లలందరూ ఈ బాలోత్సవంలో పాల్గొనాలని కోరారు. ప్రతి ఏడాది పండగలా బాలోత్సవాన్ని నిర్వహిస్తున్నందుకు కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ప్రైవేట్ విద్యా సంస్థల జిల్లా గౌరవాధ్యక్షులు పిబివి సుబ్బయ్య మాట్లాడుతూ పిల్లలందరూ పాల్గొనేలా చేసి సృజనాత్మకతను వెలికి తీసేలా ఈ బాలోత్సవం నిర్వహిస్తున్నారని, పిల్లలను కేవలం చదువుకే పరిమితం చేయకుండా ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనేలా చేయాలని కోరారు. క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డాక్టర్ అక్తర్ భాను మాట్లాడుతూ పిల్లల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు, మానసిక ఉల్లాసం కోసం ఈ కార్యక్రమాలు తోడ్పడతాయన్నారు. ముందుగా కర్నూలు బాలోత్సవం పూర్వ ప్రధాన కార్యదర్శి జెఎన్ శేషయ్యకు నివాళిగా మౌనం పాటించారు. కార్యక్రమంలో ప్రయివేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షులు వాసుదేవయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల సిఈఓ విల్సన్, ఇండస్ పాఠశాల ప్రిన్సిపల్ మీనాక్షి విల్సన్, బాలోత్సవం ఉపాధ్యక్షులు సుధీర్ రాజు, రమాదేవి, కోశాధికారి జె.రంగస్వామి, ప్రచార కార్యదర్శులు ఈ.ఎల్లాగౌడ్, డి.చంద్ర మోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బాలోత్సవం లోగోను ఆవిష్కరిస్తున్న గౌరవాధ్యక్షులు జి.పుల్లయ్య, అధ్యక్షులు జంధ్యాల రఘుబాబు, ప్రధాన కార్యదర్శి డి.ధనుంజయ తదితరులు

ఎంపిపిపై నెగ్గిన అవిశ్వాసం


- అవిశ్వాసానికి అనుకూలంగా 13 మంది ఎంపిటిసిలు
- సంపూర్ణంగా గైర్హాజరయిన వ్యతిరేక పక్షం ఆరుగురు సభ్యులు
- ఏకగ్రీవంగా కర్నూలు ఎంపిపి అవిశ్వాస తీర్మానం

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండల పరిషత్ అధ్యక్ష పదవిపై టిడిపి అనుకూల సభ్యులు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం ఏకగ్రీవంగా సభ్యులు ఆమోదించారు. గత కొద్ది రోజులుగా సాగుతున్న ఎంపిపి అవిశ్వాస తీర్మానం ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం సుఖాంతం అయింది. కర్నూలు మండల అధ్యక్ష స్థానాన్ని గత ఎంపిటిసి ఎన్నికల్లో వైసిపి కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మధ్యంతరంగా టిడిపి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ అప్పట్లో తీర్మానం ఒక్క ఓటు తేడాతో వీగిపోయింది. అప్పట్లో వైసిపి అధికారంలో ఉండడంతో పరిస్థితి టిడిపికి అనుకూలించలేదు. కాగా తాజాగా కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఎంపిపి స్థానాన్ని ఎట్టకేలకు దక్కించుకోవాలన్న పంతం టిడిపి నాయకుల్లో బలంగా నాటుకుంది. ఎంపిపిని దించేందుకు చట్టాలు, నిబంధనలు అడ్డుగా వచ్చాయి. ఎంపిపిగా ఎన్నికైన తర్వాత నాలుగేళ్ల పాటు ఆ స్థానాన్ని మధ్యలో అవిశ్వాసాన్ని ప్రవేశం పెట్టేందుకు వీలు లేకుండా చట్టాలు అడ్డు రావడంతో టిడిపి మెజార్టీ సభ్యులను సమీకరించినా మిన్నకుండి పోవాల్సి వచ్చింది. ఇటీవల ఆ గడువు తీరడంతో గత నెల నవంబర్ 7వ తేదీన అవిశ్వాసాన్ని తెలుపుతూ 13 మంది సభ్యులు కర్నూలు ఆర్డీవోను కలిసి లేఖ సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆర్డిఓ సభ్యులకు డిసెంబర్ 2న హాజరుకావాలని సభ్యులకు నోటీసులు అందించారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం కర్నూలు ఎంపీపీ హాలులో ఆర్డీవో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి అవిశ్వాసాన్ని ప్రకటించిన 13 మంది ఎంపిటిసి సభ్యులు హాజరై కాగా, 6 మంది వ్యతిరేక పక్ష సభ్యులు ఎవరు హాజరు కాకపోవడంతో అవిశ్వాసాన్ని ఏకగ్రీవంగా ప్రకటిస్తూ తీర్మానం చేశారు. అవిశ్వాస తీర్మానాన్ని ప్రభుత్వానికి, ఎన్నికల కమిషన్‌కు తెలియజేయాల్సి ఉంది. విశ్వాసం నెగ్గిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించుకున్నారు.

నెగ్గిన పంతం : వైసిపి ప్రభుత్వం ఉన్న సమయంలో టిడిపి అవిశ్వాసాన్ని ప్రవేశపెట్టి కేవలం ఒక్క ఓటు వ్యత్యాసంతో అవిశ్వాసం వీగిపోయింది. టిడిపి అధికారంలోకి రావడంతో ఎలాగైనా ఎంపిపి స్థానాన్ని చేజిక్కించుకోవాలని టిడిపి సీనియర్ నాయకులు, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు పట్టుపట్టారు.

ఈ నేపథ్యంలో మండలంలోని ఎంపీటీసీలను సమీకరించే దిశగా పావులు కదిపారు. అవిశ్వాసానికి సరిపడా సంఖ్యను సమీకరించి రంగంలోకి దిగారు. ఈ నేపథ్యంలో అవిశ్వాసం నెగ్గి పంతాన్ని నెరవేర్చుకున్నారు.



ఎంపిపిపై అవిశ్వాసం నెగ్గిన తర్వాత ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరికి, కెడిసిసిబి చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డికి పూలమాల వేసి సంబరాలు జరుపుకుంటున్న టిడిపి నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్యాంకుమార్

ప్రతిభకు వైకల్యం అడ్డుకారాదు

- ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్

ప్రజాశక్తి - పత్తికొండ

వికలాంగులకు వైకల్యం వారి ప్రతిభకు అడ్డుకారాదని ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ తెలిపారు. మంగళవారం పత్తికొండ భవిత కేంద్రంలో సమగ్ర శిక్ష విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక అవసరాల పిల్లలకు వైకల్యపు పరీక్షల ప్రత్యేక క్యాంప్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా వేద క్రీడల్లో ప్రతిభ చూపిన ప్రత్యేక అవసరాల విద్యార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందించారు. వైకల్యం ఉన్న పిల్లలను సమాజంలో ఒకరిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం భవిత కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రత్యేక శిక్షణ అందిస్తుందన్నారు. ఈ కేంద్రాల్లో వారి లోపాలకు అనుగుణంగా వారికి ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు కూడా వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే దిశగా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు సేవలందిస్తున్న భవిత కేంద్రాల నిర్వాహకులు సిబ్బందికి ఆయన అభినందనలు తెలిపారు. పత్తికొండ, దేవనకొండ, మద్దికేర, తుగ్గలి మండలాల పరిధి నుంచి 65 మంది ప్రత్యేక అవసరాలు పిల్లలకు పరీక్షలు నిర్వహించామని వారికి అవసరమైన పరికరాలు రెండు నెలల్లో అందిస్తామని అలెన్కో సంస్థ ప్రతినిధి ప్రియ వర్మ తెలిపారు. ఎస్ఎస్ఎ ఎపిసి డాక్టర్ బిఎన్ లోకరాజు, జిల్లా సహిత విద్యా కోఆర్డినేటర్ సురేంద్ర బాబుజి, ఎంఈఓలు రాజా రామ్ మోహన్, రమేష్, ఐఈఆర్టీలు శ్రీనివాసులు, తేజ కుమార్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిని లోకనాథ్, టీడీపీ రాష్ట్ర నాయకులు వెంకటపతి, అర్బన్ సిఐ జయన్న పాల్గొన్నారు.

ఉలిందకొండ పోలీసు స్టేషన్‌లో ఎస్పీ వార్షిక తనిఖీ

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

ఉలిందకొండ పోలీసు స్టేషన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ మంగళవారం వార్షిక తనిఖీ చేపట్టి, రికార్డులను పరిశీలించారు. పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసుల్లో పెండింగ్ కేసులు వాటి స్థితిగతులు, నిందితుల అరెస్టు, కేసుల దర్యాప్తులు, వాటి పురోగతిపై కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల గురించి ఆరా తీశారు. ప్రాపర్టీ కేసులను చేధించి రికవరీలు చేయాలన్నారు. విజిబుల్ పోలీసింగ్ చేయాలన్నారు. బాధితులు పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించినప్పుడు సమస్యలకు పరిష్కారం చూపాలన్నారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సైబర్ నేరాల పై, మహిళల చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డీఎస్పీ జె.బాబు ప్రసాద్, రూరల్ సిఐ చంద్రబాబు నాయుడు, డిసిఆర్‌బి సిఐ గుణశేఖర్ బాబు, ఉలింద కొండ ఎస్ఐ ధనుంజయ ఉన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

'చలో విశాఖ'ను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో సిఐటియు అఖిలభారత మహాసభలు అలాగే జనవరి 4న ఆర్కే బీచ్‌లో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిస్తూ చలో విశాఖపట్నం పోస్టర్లను సిఐటియు జిల్లా నాయకులు కార్మిక కర్షక భవన్‌లో మంగళవారం ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.రాధాకష్ణ. ఎండి.అంజిబాబు మాట్లాడుతూ.... ఆంధ్ర రాష్ట్రం విడిపోయాక జరుగుతున్న మొట్టమొదటి సిఐటియు ఆల్ ఇండియా మహాసభలు విశాఖపట్నంలో జరగడం కార్మిక వర్గానికి గర్వకారణం అని, ఉద్యోగ కార్మికులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న దాడులను ఈ మహాసభల ద్వారా ఎదుర్కొంటామని తెలిపారు. ఉద్యోగ, కార్మిక ఐక్యతను చాటి మహాసభల జయప్రదానికి యావత్ కార్మిక వర్గం కృషి చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. బడాపెట్టుబడిదారులకు ఊడిగం చేస్తున్న ఈ ప్రభుత్వాలు సంపద సష్టించే కార్మిక వర్గాన్ని మరిచి పోరాడి సాధించుకున్న లేబర్ చట్టాలను భారీ మార్పులు చేస్తూ కార్మికులను కట్టు బానిసలుగా ఈ ప్రభుత్వాలు తయారు చేస్తున్నాయని, వీటిపై మహాసభల్లో చర్చించి ఆందోళనలు నిర్వహించి కార్మిక వర్గానికి అండగా సిఐటియు నిలుస్తుందని తెలిపారు. సిఐటియు జిల్లా నాయకులు నిర్మలమ్మ బి.రామాంజనేయులు, గోపాల్, ప్రభాకర్, విజయ్, నరసింహులు, తిమ్మప్ప, ఉమా, బాల దుర్గమ్మ, సుధాకరప్ప పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి - డీన్ డాక్టర్ అక్తర్ భాను

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నషా ముక్త్ భారత్ అభియాన్ నోడల్ ఆఫీసర్, క్లస్టర్ వర్సిటీ డీన్ అక్తర్ భాను తెలిపారు. మంగళవారం పసుపుల గ్రామంలో జరిగిన ఎన్ఎస్ఎస్ క్యాంపు శుభ్రంలో గోడపత్రికను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ... మత్తు పదార్థాల వల్ల యువత జీవితం నాశనం అవుతుందని తెలిపారు. ఈగల్ టీం ఇన్‌ఛార్జీ ఎస్ఐ సుజన్ కుమార్ మాట్లాడుతూ... యువత మత్తు పదార్థాలకు త్వరగా కనెక్ట్ అవుతున్నారని, దాని ద్వారా వినాశనం కోరుకుంటున్నారని చెప్పారు. ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ వినోల్యా కుమారి, హెచ్ఎం విజయమ్మ పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న అక్తర్ భాను

వేళలు పాటించని బస్సులు...

- ఒకే సమయంలో మూడు, నాలుగు బస్సులు
- లేకపోతే గంటల తరబడి రాని బస్సులు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి - సిబెళగల్


సిబెళగల్ - గూడూరు దారిలో ఏ బస్సు, ఏ వేళకు వస్తుందో, ఏ వేళకు వెళ్తుందో ప్రజలకు, ప్రయాణికులకు అర్థంకాని పరిస్థితి నెలకొంది. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు విన్నవించినా చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లుగా ఉందని ప్రజలు, ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లుగా ఈ రూట్‌లో బస్సు వేళలు తుస్సుమంటున్నాయని, పట్టించుకొనే నాథుడే లేడని పలువురు, ప్రజా సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. కర్నూలు నుంచి గూడూరు మీదుగా సిబెళగల్, అలాగే ఎమ్మిగనూరు వరకు గల ఈ రూట్‌లో సుమారు 75 కిలోమీటర్లు ఉంటుంది. ఇదే రూట్‌లో బెళగల్, గూడూరు ప్రధాన కేంద్రాలుగా ప్రజల, ప్రయాణికుల రాకపోకలు అధికమయ్యాయి. మారుమూల గ్రామాల నుంచి ఇదే కేంద్రాలకు ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. అటువంటి ఈ కేంద్రాలకు బస్సులు సకాలంలో వస్తాయని ఎదురు చూడగా.. చూడగా ఒకేసారి మూడు లేదా నాలుగు.. కొన్ని సందర్భాల్లో ఐదేసి బస్సులు కూడా వస్తుంటాయి. ఉన్న బస్సులను అరగంటకు ఒకటి గాని, 20 నిమిషాలకు ఒక బస్సు వేస్తే ప్రయాణ కష్టాలు ఉండవు. వేళల్లో ఏమాత్రం మార్పు లేనందున వచ్చే బస్సుల కోసం తక్కిన సమయంలో ప్రయాణికులు గంటల తరబడి వేచి చూస్తూ అవస్థలు పడుతున్నారు.



వరుసగా వెళ్తున్న బస్సులు

ప్రతి జనరల్ బాడీలోనూ రచ్చ రచ్చ


- జె.మోహన్, సిపిఎం డివిజన్ నాయకులు



ఈ రూట్‌లో బస్సుల వేళలపై బెళగల్ పరిషత్‌లో జరిగే ప్రతి జనరల్ బాడీలోనూ ప్రజా ప్రతినిధులు, ఆర్‌టిసి అధికారులు రచ్చరచ్చ చేస్తున్నారు. అప్పటికేమో అధికారులు చర్యలు చేపడతామని చెప్పి పట్టించుకున్న పాపానలేదు. ఒకే సమయంలో బస్సులు రాక పోకలతో ప్రభుత్వ ఆదాయానికి కూడా గండి పడుతోంది. తగు వేళలు పాటిస్తే ప్రయాణికులకు పాట్లు, ఆర్‌టిసికి కూడా నష్టం ఏమాత్రం ఉండదు.

రేసు బస్సులను తలపిస్తున్నాయి


- ఏసు, సంఘాల



సి బెళగల్, గూడూరు రూట్‌లో వేళాపాలా లేకుండా వస్తూ పోతున్న బస్సులు రేసు బస్సులను తలపిస్తున్నాయి. ఆ బస్సులన్నీ ఒకే వేళలో వెళ్తున్నప్పుడు వచ్చే దుమ్ము ధూళితో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రజలకు, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అధికారులు బస్సులను సకాలంలో నడిపించాలి.

వేళకు వెళ్లలేక పోతున్నాం

- మదిర కేశన్న, సి.బెళగల్



శుభకార్యాలకు, ఇతర అవసరాలకు, సుదూర ప్రాంతాల్లో పనుల నిమిత్తం బస్టాండ్‌కు వేళకు వస్తున్నాం. బస్సులు సకాలంలో లేనందున వేళకు వెళ్లలేక పోతున్నాం. వచ్చిన వేళల్లో గల బస్సుల్లో వెళ్తే అవీ కూడా గంటల తరబడి నడపడం వలన ప్రయాణ వెతలు తప్పట్లేదు. ఈ సోమవారం సాయంత్రం ఐదు బస్సులు ఒకే సారి కర్నూలుకు వెళ్లడం ఆశ్చర్యం కలిగించింది.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

మండలాభివృద్ధికి నిధులు కేటాయించాలి: సిపిఎం

ప్రజాశక్తి- కోడుమూరు

మండల అభివృద్ధికి నిధులు కేటాయించాలని సిపిఎం మండల కార్యదర్శి కె.రాజు అధ్యక్షతన తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల నాయకులు గఫూర్ మియా, రాజు మాట్లాడారు. నవంబర్ నెలలో సిపిఎం ఆధ్వర్యంలో రైతులు, కార్మికులు, పేదలు, బడుగు, బలహీన వర్గాలు, గ్రామాల అభివృద్ధి పరిశీలన కొరకు జీపు జాత నిర్వహించడం జరిగింది మండలంలోని 16 గ్రామాలు తిరిగి అక్కడ ఉన్నటువంటి సమస్యలను పరిశీలించామన్నారు. పంటలు గిట్టుబాటు ధర లేక ఎంతో మంది రైతులు అప్పుల పాలై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అందులో చాలామంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. కనీసం మద్దతు ధర పత్తికి రూ.12వేలు ఇస్తే రైతుకు ధర గిట్టుబాటు అవుతుందన్నారు. అలాగే రైతు భరోసా కింద 20,000 ఇస్తామన్నారని, అవి ఏ మాత్రం చాలదని, కనీసం ఎకరాకు 50 వేల రూపాయలు ఇస్తే రైతు కోల్కుంటాడని తెలిపారు. అలాగే గోరంట్ల గ్రామంలో హంద్రీ నదిపై నిర్మాణంలో ఆగిపోయిన బ్రిడ్జిని పూర్తి చేస్తే క్రిష్ణగిరి, వెల్దుర్తి మండలాల నుండి వచ్చే వారికి సదుపాయం కల్పించాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు తాగు, సాగు నీరందించాలని, సిసి రోడ్, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్ఐ అశోక్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. లక్ష్మన్న, కుమారస్వామి, టి.వీరన్న, బుడ్డప్ప, గిడ్డయ్య మునుస్వామి శేఖర్, మల్లికార్జున, శంకర్, పరమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

బ్లడ్ బ్యాంకుకు స్టేట్ ఫస్ట్ అవార్డు

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల బ్లడ్ బ్యాంక్‌కు రాష్ట్రంలోనే అత్యధికంగా బ్లడ్ యూనిట్ల ను కలెక్ట్ చేసినందుకుగాను రాష్ట్రస్థాయిలో మొట్టమొదటి స్థానం లభించింది. డిసెంబర్ 1న ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అవార్డును అందుకోవడం పట్ల బ్లడ్ బ్యాంక్ సిబ్బందిని, డాక్టర్లను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె వెంకటేశ్వర్లు అభినందించారు. ఆయన మాట్లాడుతూ బ్లడ్ బ్యాంక్ యందు సంవత్సరకాలంలో 11531 బ్లడ్ యూనిట్స్ కలెక్ట్ చేసినందుకు గాను సేవల విషయంలో ఉత్తమ సేవలు అందించినందుకు రాష్ట్రస్థాయిలో మొదటి స్థానం సాధించినట్లు తెలిపారు. ఈనెల 1న విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బ్లడ్ బ్యాంక్ తరపున స్టేట్ ఫస్ట్ అవార్డు తీసుకున్నట్లు చెప్పారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ సుదీర్, డాక్టర్ రసూల్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ రంగస్వామి, పాల్గొన్నారు.

జిజిహెచ్ ఐసిటిసి సెంటర్‌కు : కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో గల మైక్రోబయాలజీ విభాగం పరిధిలో పనిచేస్తున్న ఐసిటిసి సెంటర్‌కు రాష్ట్రస్థాయి ఉత్తమ సేవల అవార్డు అందుకుందని ఆస్పత్రి అడిషనల్ డిఎంఇ, సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్ఐవి స్క్రీనింగ్ సేవలు, కౌన్సెలింగ్ నాణ్యత, డేటా మేనేజ్‌మెంట్, పేషెంట్ కేర్‌లో చూపుతున్న పనితీరుకు గుర్తింపుగా ఈ పురస్కారం ప్రదానం చేసినట్లు చెప్పారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి అండ్ ప్రొఫెసర్ డాక్టర్ రేణుకాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ నాగజ్యోతి, ఐసిటిసి ఇన్‌ఛార్జి డాక్టర్ శరణ్యను అభినందించారు.

అనుమతుల్లేని లాడ్జీలపై కేసులు

- కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

కుడా అనుమతులు లేని లాడ్జీల యజమానులపై కేసులు నమోదు చేస్తామని కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం స్థానిక జిపిఎస్ రెసిడెన్సిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ ద్వారా గృహ నిర్మాణాలకు అనుమతి తీసుకుని కొందరు వాణిజ్య కార్యకలాపాలకు హోంస్టే పేరుతో ప్రభుత్వానికి కట్టాల్సిన పన్ను కట్టకుండా మోసం చేస్తున్నారని, అలాంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. పంచాయతీ ద్వారా జి ప్లస్ టూ వరకు అనుమతి ఇచ్చే అధికారం మాత్రమే ఉంటుందని, ఆపై కట్టడాలకు కుడా అనుమతి తప్పనిసరి అని చెప్పారు. మంత్రాలయంలో ఇలాంటి కట్టడాలను గుర్తించి నోటీసులు కూడా ఇచ్చినట్లు తెలిపారు. నిర్లక్ష్యం వ్యవహరించి కట్టడాలను అలాగే కొనసాగిస్తే కూల్చడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు. కొందరికి తెలియక ఇళ్ల అనుమతితోనే లాడ్జీలుగా మార్చి వ్యాపారాలు చేసుకుంటున్నారని, అలాంటి అనుమతి చెల్లదని తెలిపారు. కొందరు కుడా అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని, జిపిఎస్ ద్వారా ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం చెల్లించి కుడా అప్రూవల్ పొందాలని చెప్పారు. లేకపోతే నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లాడ్జీల నిర్వాహకులు అవగాహన పెంచుకొని తమ వద్దకొచ్చి తగిన సమాచారంతో ఎలాంటి అపరాధ రుసుం లేకుండా కుడాకు కట్టాల్సిన పన్ను మాత్రమే కట్టించుకుంటామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్ర రెడ్డి పాల్గొన్నారు.

కలెక్టర్ దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి - చిప్పగిరి



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మండలంలో పర్యటించిన కలెక్టర్ డాక్టర్ ఎ.సిరికి మండల సమస్యలను వివరించారు. హంద్రీ నీవా కెనాల్ నుంచి హెచ్ఎల్‌సి కాలువకు శాశ్వత తూము ద్వారా నీటి సరఫరా చేయాలని టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు మంగళవారం టిడిపి నాయకులు, ప్రజాప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. మండలంలోని డేగలహాలు, బంటనహాల్, నంచర్ల, కుందనగుర్తి, నేమకల్లు, రామదుర్గం ప్రధాన రహదారులు అధ్వానంగా ఉన్నాయని, బిటి రోడ్లు మంజూరు చేయాలని కోరారు. ఆయా గ్రామాల్లోని శ్మశాన వాటికల గురించి విన్నవించారు. సింగిల్‌విండో చైర్మన్ కొండ రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ పురుషోత్తం, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జీ ప్రభాకర్, అశోక్ యాదవ్, బిజెపి నాయకులు తిమ్మప్ప, నారాయణస్వామి పాల్గొన్నారు.

నేడు అలారుదిన్నె బ్రిడ్జికి మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆస్పరి



శిథిలావస్థకు చేరిన బ్రిడ్జి

'ప్రమాదపుటంచున అల్లారుదిన్నె బ్రిడ్జి' అన్న శీర్షికన సోమవారం ప్రజాశక్తి పత్రికలో ప్రచురించిన వార్తకు ఆర్అండ్‌బి అధికారులు స్పందించారు. మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సిఐ గంగాధర్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ... దెబ్బతిన్న బ్రిడ్జికి బుధవారం మరమ్మతులు చేపడుతున్నందున రాకపోకలకు అంతరాయం ఉంటుందని తెలిపారు. భారీ వాహనాలు, 4 చక్రాల వాహనాలు బ్రిడ్జిపై వెళ్లడానికి అనుమతి లేదన్నారు. భారీ వాహనాల దారి మళ్లింపులో భాగంగా పత్తికొండ, దేవనకొండ మీదుగా కర్నూలుకు వెళ్లాలన్నారు. రెండురోజుల పాటు బ్రిడ్జి పై మరమ్మతులు చేపడుతున్నట్లు తెలిపారు. ఆస్పరి అంబేద్కర్ సర్కిల్ వద్ద సూచన బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

నేడు ఎన్‌డిఎ ఆత్మీయ సమావేశం

- జనసేన పార్టీ మండల కన్వీనర్ చంద్ర

ప్రజాశక్తి - హాలహర్వి



ఎన్‌డిఎ ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ మండల కన్వీనర్ చంద్ర, సిద్ధిలింగ కోరారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడారు. బుధవారం హాలహర్విలోని శ్రీచైత్ర గుడి ఆంజనేయస్వామి కళ్యాణ మండపం ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా జనసేన జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వైకుంఠం జ్యోతి, జనసేన ఆలూరు ఇన్‌ఛార్జీ తెర్నేకల్ వెంకప్ప హాజరవుతున్నట్లు చెప్పారు. కూటమి నాయకులు, సొసైటీ చైర్మన్లు నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కెజిబివి అభివృద్ధే లక్ష్యం

- విద్యాకమిటీ చైర్మన్ భీమన్న
- దాతల సహకారంతో వాలీబాల్ గ్రౌండ్ ఏర్పాటు

ప్రజాశక్తి - నందవరం

కెజిబివి పాఠశాల అభివృద్ధే లక్ష్యమని విద్యాకమిటీ చైర్మన్ భీమన్న తెలిపారు. పాఠశాలలో నూతన వాలీబాల్ గ్రౌండ్ ప్రారంభోత్సవం మంగళవారం పిఒపి శిరోమణి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా మండల వైద్యాధికారిణి శ్రీలేఖ, వ్యవసాయ అధికారి సరిత, జనసేన మండల అధ్యక్షులు పెద్ద ఎల్లప్ప, తుగ్గలి ఈరన్న గౌడ్, హెడ్ కానిస్టేబుల్ రవి, వైస్ చైర్మన్ సునీత హాజరయ్యారు. వారిని పిఒపి, చైర్మన్ ఘనంగా సన్మానించి ఆహ్వానం పలికారు. ముఖ్య అతిథులు రిబ్బన్ కట్ చేసి గ్రౌండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి శ్రీలేఖ, సరిత మాట్లాడారు. విద్యతోపాటు ఆటలు కూడా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. మానసిక సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే ప్రశాంతమైన వాతావరణంలో క్రీడలు ఆడాలని తెలిపారు. జనసేన మండల అధ్యక్షులు ఎల్లప్ప, రవి మాట్లాడారు. విద్యార్థులు క్రీడారంగంలో అభివృద్ధి చెందాలని కోరారు. క్రీడల ద్వారా మానసికోల్లాసం, ఉద్యోగావకాశాలు లభిస్తాయని తెలిపారు. ఎల్లప్పుడు విద్యార్థులు, ఉపాధ్యాయులు కబడ్డీ గ్రౌండ్స్ సహకరించాలని కోరారు... ఆయన స్పందించి కబడ్డీ గ్రౌండ్ నిర్మాణానికి ఆర్థిక సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఈరన్న గౌడ్ మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి మరింత సహాయం అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలో పదో తరగతి పరీక్షల్లో పాఠశాలలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి బహుమతి అందిస్తామన్నారు. పిఒపి శిరోమణి మాట్లాడుతూ... పాఠశాలలో విధులు నిర్వహించినప్పటి నుంచి గ్రౌండ్ సదుపాయం లేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని, చైర్మన్ స్పందించి వాలీబాల్ కోర్టు నిర్మించడం ఆనందదాయకమని తెలిపారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడారు. చైర్మన్‌గా ఎన్నికైనప్పటి నుంచి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చైర్మన్‌గా ఎన్నిక కావడం అదృష్టంగా భావించానని, పేద విద్యార్థులకు సహాయం చేయడానికి గొప్ప అవకాశంగా భావించానని చెప్పారు. మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల నుంచి రాష్ట్రస్థాయికి ఎన్నికైన వారున్నారని చెప్పారు. క్రీడా స్ఫూర్తి ఉన్నా మైదానం అనుకూలంగా లేకపోవడంతో వారి క్రీడాభివృద్ధికి సహాయం చేయాలన్న సంకల్పంతో దాతలను సహకారం కోరినట్లు తెలిపారు. అడిగిన వెంటనే చాలామంది ఆర్థిక సహాయం అందించారని చెప్పారు. జనసేన మండల అధ్యక్షులు రూ.18 వేలు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నల్లంగి నాగరాజ్ రూ.10 వేలు, టిడిపి నాయకులు బోయ వీరేష్ రూ.4 వేలు, ఎల్ఐసి తుగ్గలి ఈరన్న గౌడ్ రూ.3 వేలు, కోట వీధికి చెందిన కానిస్టేబుల్ లక్ష్మణ రూ.2 వేలు, కానిస్టేబుల్ బి.రవి రూ.వెయ్యి, విద్యా కమిటీ వైస్ చైర్మన్ సునీత రూ.2 వేలు, విజయ్ రూ.500 ఇచ్చారన్నారు. తన వంతు సహాయంగా రూ.8 వేలు ఇచ్చినట్లు తెలిపారు. దాతలను, గ్రౌండ్ అభివృద్ధికి తోడ్పాటుగా కృషి చేసిన విశాలాంధ్ర విలేకరి గోవిందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, చంద్ర, అంజి, ఇర్ఫాన్, ఆదిల్, పవన్, పూలచింత శంకర్, రామలింగడు, బంగారి, నరసింహులు, ఉపాధ్యాయులు జి.రంగమ్మ, కె.మంజుల, బి.ప్రభావతి, వి.పద్మ లత, జి.నౌరీన్, కె.అంజు, కె.రమాదేవి, ఎస్.లీలావతి, కె.నీలవేణి, అటెండర్ సి.మౌనిక పాల్గొన్నారు.



గ్రౌండ్‌ను ప్రారంభిస్తున్న పిఒపి శిరోమణి



నాగరాజు



పెద్ద ఎల్లప్ప

కూటమితోనే రైతు శ్రేయస్సు

- ఎమ్మెల్యే బీవీ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

రైతు శ్రేయసుకు టిడిపి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పెసలదిన్నె గ్రామాన్ని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి సందర్శించారు. కొత్తగా మంజూరైన వితంతు పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. 'రైతన్న కోసం - రైతు భరోసా'లో పాల్గొని రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో నిర్మించిన కొత్త సిసి రోడ్డును ప్రారంభించి, మినీ గోకులం షెడ్ నిర్మాణానికి పూజలు చేశారు. గ్రామంలోని రోడ్లు, చెరువులు, పొలం రస్తా, డ్రెయినేజీలు, తాగునీటి సరఫరా వంటి ప్రజాప్రయోజన సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి సంబంధిత అధికారులకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



లబ్ధిపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బీవీ



కుటుంబ సభ్యులతో ఎమ్మెల్యే బీవీ

రామకృష్ణ కుటుంబానికి బీవీ పరామర్శ

పట్టణంలోని 34వ వార్డు అధ్యక్షులు బోయ రామకృష్ణను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ పరామర్శించారు. కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మరణించిన ఆయన తల్లి బోయ గోవిందమ్మ మరణవార్త తెలుసుకుని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-ఆలూరు

ఆలూరులోని సిద్ధేశ్వర (సిపిఎం) కాలనీకి చెందిన ఎరుకలి ఉలిగప్ప (40) మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. బంధువుల వివరాల మేరకు... ఉలిగప్ప భార్య మారెమ్మతో పాటు వంటకు కట్టెలు కొట్టేందుకు వెళ్లి ఛాతి నొప్పి ఉందని ఇంటికొచ్చి ఆస్పత్రికి వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఉలిగప్ప మృతి చెందడంతో కుటుంబసభ్యుల రోధనలు అందరినీ కన్నీరు పెట్టించాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు, స్థానికులు కోరారు. ఉలిగప్ప మృతదేహాన్ని సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, నాయకులు నారాయణ స్వామి, ఈరన్న, విఠల్ సందర్శించి కుటుంబానికి సానుభూతి తెలిపారు.



ఉలిగప్ప (ఫైల్)

అలారుదిన్నె నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- 6న బ్రిడ్జిపై నిరసన : సిపిఎం

ప్రజాశక్తి- దేవనకొండ

కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిలో శిథిలావస్థకు చేరిన అలారుదిన్నె బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని సిపిఎం దేవనకొండ, ఆస్పరి మండల కార్యదర్శులు బి.వీరశేఖర్, బి.బాలకృష్ణ కోరారు. ప్రజల ప్రాణాలకు ప్రభుత్వం భరోసా కల్పించాలని, బ్రిడ్జి దగ్గర ఏదైనా ప్రమాదం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. మంగళవారం దేవనకొండలోని సిఐటియు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆంధ్ర, కర్ణాటకను కలుపుతూ ప్రధానంగా కర్నూలు-బళ్లారి మధ్య కీలకమైన రహదారి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం కొనసాగుతోందని విమర్శించారు. ఎప్పుడో బ్రిటీష్ కాలంలో నిర్మించిన బ్రిడ్జి నేడు శిథిలావస్థకు చేరినా పట్టించుకోకపోవడం దారుణమని మండిపడ్డారు. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిపై రోజువారీగా వందల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, రాకపోకల సందర్భంగా బ్రిడ్జి ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వెంటనే బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. తాత్కాలికంగా నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని పేర్కొన్నారు. బ్రిడ్జి పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యానికి నిరసనగా ఈనెల 6న బ్రిడ్జి దగ్గర రాస్తారోకో నిర్వహిస్తున్నామని, అధికారులు, ప్రభుత్వం స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణంపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు అశోక్, యూసుఫ్ బాషా, నాగేంద్ర, బలరాముడు, రాయుడు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

సిద్ధార్థ నాయుడు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తనయుడు, యువ నాయకులు సిద్ధార్థ నాయుడు పుట్టినరోజు వేడుకలను అభిమానులు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆదోనిలోని అనాథ ఆశ్రమంలో టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు తిమ్మప్ప, దొడ్డనగేరి శివప్ప, హౌసింగ్ సొసైటీ డైరెక్టర్ ఆరెకల్ రామకృష్ణ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అభాగ్యులకు, అనాథలకు అన్నదానం చేశారు. ఆశ్రమంలో కేక్ కట్ చేసి, వృద్ధులు, అనాథ పిల్లల మధ్య ఉల్లాసంగా గడిపారు. తిమ్మప్ప, ఆరెకల్ రామకృష్ణ, శివప్ప, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని సిద్ధార్థ నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.



అన్నదానం చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజా ఉద్యమాన్ని నిర్లక్ష్యం చేయవద్దు

- మాజీ ఎంపీ బుట్టా రేణుక

ప్రజాశక్తి - ఆదోని

ప్రజా ఉద్యమాన్ని ప్రభుత్వం గుర్తించకుండా నిర్లక్ష్యం చేయడం తగదని మాజీ ఎంపీ బుట్టా రేణుక తెలిపారు. ఆదోని జిల్లా సాధన కోసం పట్టణంలోని కోట్ల విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారం 17వ రోజుకు చేరాయి. వైసిపి ఆదోని ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డితో కలిసి ఆమె సంఘీభావం తెలిపారు. అంతకుముందు మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి గృహం నుంచి బుట్టా రేణుక అనుచరులు భారీ ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజల ఆకాంక్ష ఆదోని జిల్లా సాధన అని, రోడ్లపైకొచ్చి స్వచ్ఛందంగా ఆందోళన నిర్వహిస్తున్నా ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. కర్నూలుకు వెళ్లాలంటే హాలహర్వి, కౌతాళం, హొళగుంద ప్రాంత వాసులకు 150 కిలోమీటర్ల దూరం అవుతుందన్నారు. ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ, ఆలూరు ప్రాంత వాసులకు ఆదోని అనుకూలంగా ఉంటుందన్నారు. 2029లో వైసిపి అధికారంలోకి రావడం ఖాయమని, జగన్మోహన్ రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కాగానే ముందుగా ఆదోని జిల్లా ప్రకటన చేయిస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ... ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలన్నా, పరిశ్రమలు ఏర్పాటు కావాలన్నా ఆదోని జిల్లాగా రూపాంతరం చెందాలని తెలిపారు. జిల్లా సాధనతో పాటు మెడికల్ కళాశాల కోసం జరిగే ఉద్యమంలో కలిసి రావాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి, చంద్రకాంత్ రెడ్డి, బాలాజీ, ముమ్మూత్ స్వామి, ఫయాజ్, జిల్లా సాధన సమితి నాయకులు రఘురామయ్య, లలిత, కృష్ణమూర్తి, దస్తగిరి నాయుడు, వీరేష్, కుంకనూరు వీరేష్, సాయిరామ్, గోపాల చారి ఉన్నారు.





గోడపత్రికలను విడుదల చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఆలూరు

ఈనెల 4, 5వ తేదీల్లో ఆలూరులో నిర్వహించే ఎస్ఎఫ్ఐ 50వ స్వర్ణోత్సవ మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఉమేష్, జిల్లా మాజీ ఉపాధ్యక్షులు మైనా కోరారు. మంగళవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో మహాసభల గోడపత్రికలను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ... జిల్లా విద్యార్థి ఉద్యమంలో విద్యార్థుల సమస్యల పరిష్కార వేగుచుక్కగా ఉన్న ఎస్ఎఫ్ఐ 49 మహాసభలను పూర్తి చేసుకుని 50వ మహాసభలకు సిద్ధమవుతోందని తెలిపారు. 4న ప్రదర్శన నిర్వహించి పాత బస్టాండ్ వద్ద బహిరంగ సభ, 5న ఇబ్రహీం ఫంక్షన్ హాలులో ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ సహాయ కార్యదర్శి గోవర్ధన్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి ఉమేష్, మండల నాయకులు మురళీ, హనుమంతు, యశ్వంత్, ఖాజా, మంజునాథ, మహేష్ పాల్గొన్నారు.

జిల్లా సాధన ఉద్యమం తీవ్రతరం



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని జిల్లా సాధనకు ఉద్యమం తీవ్రతరమవుతోంది. అన్ని వర్గాల ప్రజలు సంఘీభావం తెలుపుతూ ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. మంగళవారం ఆదోని జిల్లా సాధన కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని కోట్ల సర్కిల్ వద్ద ఆదోని జిల్లా సాధన కోసం చేపట్టిన దీక్ష మంగళవారం 17వ రోజుకు చేరింది. దీక్షలో ఆటో డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ సభ్యులు తిక్క స్వామి, ఈ.రామకృష్ణ గౌడ్, బి.చిట్టిబాబు, సి.నరసింహులు, ఎన్.ఈరన్న, చంద్రశేఖర్, హెచ్.మురళీ, జి.శేఖర్, రాఘవేంద్ర, బి.రాఘవేంద్ర, టి.వెంకటేష్, సి.రమేష్ గౌడ్, ఎస్.ప్రేమ్ కుమార్, జి.శివరాజ్, కె.లింగప్ప, షేక్షావలీ, జి.శ్రీనివాసులు, ఎస్.జిలాని కూర్చున్నారు. యూనియన్ నాయకులు టి.వీరేష్, విద్యార్థి సంఘం మాజీ నాయకులు మల్లికార్జున, పిఒడబ్ల్యు నాయకులు మనెమ్మ, సీనియర్ నాయకులు మల్లికార్జున, లక్ష్మన్న పాల్గొన్నారు.

డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

- హెడ్ కానిస్టేబుల్ భాస్కర్

ప్రజాశక్తి - మంత్రాలయం

డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెడ్ కానిస్టేబుల్ భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఆదేశాల మేరకు స్థానిక పోలీసు స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఆటోలను, ఇతర వాహనాలనను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా నిర్ణీత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. కచ్చితంగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి డ్రెస్ కోడ్‌తో వాహనాలకు సంబంధించిన రికార్డులను దగ్గర ఉంచుకోవాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం సేవించి వాహనాలు నడపడం నేరమని, అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి అపరాధ రుసుం వేసినట్లు చెప్పారు.

ఇద్దరు డ్రైవర్లకు జైలు శిక్ష

ప్రజాశక్తి - ఆదోని

మద్యం తాగి వాహనం నడిపిన ట్రావెల్స్ బస్సు డ్రైవర్లు ఇద్దరికీ 15 రోజుల జైలు శిక్షను కోర్టు తీర్పు విధించిందని ఆదోని టూ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆదోని పట్టణ శివారులో రోడ్డు ప్రమాదాల నివారణకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడారు. ప్రయాణికులతో బళ్లారి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఐవిఆర్ ట్రావెల్స్, గీతా ట్రావెల్స్ ప్రయివేట్ బస్సులను ఆదోని పిసిఆర్ సర్కిల్ దగ్గర పోలీసు సిబ్బందితో కలిసి తనిఖీ చేసినట్లు తెలిపారు. ఇద్దరు బస్సు డ్రైవర్లు, ఒక ద్విచక్ర వాహనదారుడు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారన్నారు. ట్రావెల్స్ బస్ డ్రైవర్లకు ఆదోని జెఎఫ్‌సిఎం కోర్టు 15 రోజుల పాటు జైలు శిక్ష విధించిందని తెలిపారు. ద్విచక్ర వాహనదారునికి ఆదోని జెఎఫ్‌సిఎం కోర్టు మూడు రోజుల పాటు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

చిన్నారులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ గోపీనాథ్


ప్రజాశక్తి - ఆదోని

చిన్నారులకు సీజనల్ వారీగా సోకే వ్యాధుల పట్ల తల్లిదండ్రులు సకాలంలో వైద్య చికిత్సలు చేయించి ప్రాణాపాయం నుంచి కాపాడాలని ప్రముఖ చిన్న పిల్లల డాక్టర్, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ గోపీనాథ్ తెలిపారు. మంగళవారం ఆదోని చిన్నపిల్లల డాక్టర్ల సమూహం ఆధ్వర్యంలో ఆదోని ప్రభుత్వాస్పత్రిలో హ్యాబిలిటేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పుట్టుకతో లోపాలున్న చిన్నపిల్లలు, పుట్టిన వెంటనే లోపాలున్న చిన్నపిల్లలను సమాజానికి పనికి వచ్చే విధంగా, వారి పనులు వారు చేసుకునే విధంగా తీసుకోవాల్సిన ప్రణాళికల గురించి ఆదోని మాతా, శిశు ఆస్పత్రి ఆవరణలో అవగాహన కల్పించామన్నారు. వారికి స్పీచ్ థెరపీ, మానసిక ఎదుగుదల గురించి వివరించారు. చిన్న పిల్లల డాక్టర్లు రఘునాథ్, డాక్టర్ హరీష్, డాక్టర్ ఆదిత్య, డాక్టర్ శ్రీలక్ష్మీ, డాక్టర్ బాలాజీ, డాక్టర్ మధుసూదన్ రెడ్డి, డాక్టర్ సందీప్, డాక్టర్ కిరణ్ కుమార్ ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ గోపీనాథ్

ఆంజనేయస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే



ఆలయంలో ఉన్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయం సమీపంలో ఉన్న కొండాపురం ఆంజనేయస్వామిని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ పూజారులు హండే శాంతయ్య ఆహ్వానం మేరకు వచ్చిన ఆయన ఆలయం చుట్టూ దాత కుమార స్వామి దాతృత్వంతో నిర్మించిన రేకుల షెడ్డును చూసి దాతను అభినందించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని మంగళ హారతులు స్వీకరించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, నాయకులు రాము, చిగిలి హనుమంతు, బొంబాయి నరసింహ, బంగి భీమయ్య, పూజారి హండే గోపాల్ పాల్గొన్నారు.

పైపులైన్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పట్టణంలో తాగునీటి సమస్య లేకుండా పనులు చేపడుతున్నట్లు ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని న్యూ ఇందిరా నగర్‌లో పైపులైన్ పనులను పరిశీలించారు. డిఇఇ నీరజ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు

- పంచాయతీ కార్యదర్శి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

ప్రజావసరాల కోసం ఉన్న ప్రభుత్వ స్థలాలను ఎవరూ వ్యక్తిగత అవసరాల కోసం ఆక్రమించరాదని, అలా ఆక్రమిస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని నేమకల్లు పంచాయతీ కార్యదర్శి బాలన్న హెచ్చరించారు. మంగళవారం నేమకల్లు పంచాయతీ మజరా గ్రామమైన సంగాలలో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన ఐదుగురికి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భవిష్యత్తులో ప్రభుత్వ భవనాలకు ఉపయోగపడే స్థలాలను ఎవరూ ఆక్రమించరాదన్నారు. ఏదైనా స్థలాలకు సంబంధించిన దస్తావేజులు పూర్వాపరాలు ఉంటే పంచాయతీ కార్యాలయం దృష్టికి తీసుకు రావాలన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామస్తులందరూ తోడ్పాటు ఇవ్వాలన్నారు.



మాట్లాడుతున్న పీడీ రమణారెడ్డి

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- డిఆర్‌డిఎ పీడీ రమణారెడ్డి

ప్రజాశక్తి - హాలహర్వి

పొదుపు మహిళలు ఆర్థికంగా ఎదగాలని డిఆర్‌డిఎ పీడీ వైవి.రమణా రెడ్డి తెలిపారు. మంగళవారం హాలహర్విలోని మండల మహిళా సమైక్య కార్యాలయంలో సమైక్య అధ్యక్షులు వెంకటలక్ష్మి, ఎపిఎం నాగార్జున్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని పొదుపు మహిళలు తీసుకున్న రుణాలు ద్వారా ఒకరిపై ఆధారపడకుండా ఏదైనా వ్యాపారం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. మహిళా రైతులను గుర్తించి ఎఫ్ఐఒగా ఏర్పాటు చేయాలని తెలిపారు. మునగాకు పంటను 50 ఎకరాలకు పైగా పండిస్తే మునగాకు పౌడర్ ప్రాసెసింగ్ యూనిట్ మండలంలోనే ఏర్పాటు చేసే విధంగా చూస్తామన్నారు. మండల సమాఖ్యకు సంబంధించిన అకౌంట్ పుస్తకాలను పరిశీలించారు. డిపిఎం సిబ్బంది నరసమ్మ, నవీన్, ప్రభావతి, సిసిలు ఆంజనేయులు, నరసన్న, నరసింహులు, అకౌంటెంట్ నరసింహులు పాల్గొన్నారు.

శ్రమదోపిడీ నుంచి విముక్తి కలిగించాలి

- సిఐటియు నాయకులు రాముడు

ప్రజాశక్తి - నందవరం



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఆశాలకు శ్రమదోపిడీ నుంచి విముక్తి కలిగించాలని సిఐటియు బి.రాముడు, మండల కన్వీనర్ బి.ఉరుకుంద కోరారు. నందవరం, హాలహర్వి ప్రభుత్వ వైద్య కేంద్రాల్లో ఆశాడే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఆశావర్కర్లు చాలీచాలని వేతనాలతో దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్నప్పటికీ వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోవడం అన్యాయమన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సర్వేలు చేయడం, టీకాలు వేయడం, మందులు ఇవ్వడం, టిబి, మలేరియా, డెంగీ, గర్భిణులకు రక్తపరీక్షలు చేయించి, డెలివరీ చేయిస్తారని తెలిపారు. ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు శారద, మంజుల, పుణ్యవతి, మాధవి, లలిత, రోజా, సిఐటియు నాయకులు బి.గోపాల్ పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - ఆదోని రూరల్

మండలంలోని పెద్దహరివాణం జిల్లా పరిషత్ పాఠశాలలో (ఎస్ఎస్‌హెచ్‌బి) ఆత్మ ఆధ్వర్యంలో 'నేల ఆరోగ్యం'పై మంగళవారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎమ్మిగనూరు భూసార పరీక్ష కేంద్రం ఎఒ టి.లావణ్య మాట్లాడుతూ... విద్యార్థి దశ నుంచి భూసార పరీక్షలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నేల ఆరోగ్యంగా ఉండాలంటే రసాయనిక, పురుగు మందుల వాడకం తగ్గించి, భూసార పరీక్షల ద్వారా భూమిలోని లోపాలను తెలుసుకొని.. భూమికి అవసరమైన పోషకాలు అందించి మంచి దిగుబడులు సాధించాలని సూచించారు. ఆత్మ ఎటిఎం రామాంజిని, కెవికె సిబ్బంది తేజ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు చిరంజీవి, రవీందర్ పాల్గొన్నారు.



వడ్డెరలకు అన్ని విధాలా సహకారం

- టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వడ్డెరలకు అన్ని విధాలా సహాయ, సహకారాలు అందిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. మంగళవారం వడ్డెర కుల సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీధర్ కర్నూలులో వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణం కోసం తిక్కారెడ్డిని హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణానికి సహాయ, సహకారాలు అందించాలని సంఘం జిల్లా నాయకులు, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షులు, సినీ నటుడు సాతునూరు మంజునాథ్ ఆధ్వర్యంలో వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షులు శ్రీధర్, జాతీయ పారిశ్రామికవేత్త క్రిష్ణయ్య, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు శివకుమార్, జాతీయ యువజన అధ్యక్షులు వేముల భరత్ కలిశారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ... కర్నూలులో వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణానికి సహాయం చేస్తామని తెలిపారు.

పెంచలయ్య హత్య నిందితులను శిక్షించాలి : సిపిఎం



ప్రజాశక్తి - పత్తికొండ

నెల్లూరు జిల్లాలో సిపిఎం పార్టీ నాయకుడు పెంచలయ్య హత్యకు కారణమైనటువంటి వారిని కఠినంగా శిక్షించాలని పత్తికొండ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆధ్వర్యంలో నాలుగు స్తంభాల దగ్గర కులవత్తులతో నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర అధ్యక్షత వహించగా సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు రంగారెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గంజాయి విచ్చలవిడిగా దొరుకుతుందని దీనివల్ల యువత చదువుకున్న వారు కుటుంబాలు దెబ్బతింటాయని కళారూపాల్లో అనేకమందిని గంజాయి ఉచ్చ నుండి బయటపడాలని ఉద్యమాలు చేస్తున్నటువంటి పెంచలయ్యను దారుణంగా హత్య చేయడం చాలా దారుణం అన్నారు. వెంటనే పెంచలయ్య హత్యకు కారణమైనటువంటి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కాశన్న వివోఎఫ్ఐ దుర్గన్న, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నరసన్న, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మధు, షికామణి, మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు రంగస్వామి, మద్దికేర సిఐటియు మండల కార్యదర్శి రాముడు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధికి కృషి

- వీసీ వెంకట బసవరావు

ప్రజాశకి-కర్నూలు కలెక్టర్

రాయలసీమ విశ్వవిద్యాలయ అభివద్ధికి కలిసికట్టుగా కషి చేయాలని వైస్ ఛాన్సిలర్ వి.వెంకట బసవరావు పిలుపునిచ్చారు. వర్సిటీ సెనేట్ హాలులో మంగళవారం అధ్యాపకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఛాన్సర్ మాట్లాడుతూ యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవాన్ని విజయ వంతం చేయడంలో శక్తివంచన లేకుండా కషిచేసినందుకు అభినందించారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ న్యాక్ మరియు ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకుల్లో మెరుగైన స్థానాన్ని సాధించడానికి ప్రయత్నించాలని ఆయన పిలుపునిచ్చారు. రెక్టార్ ఎన్‌టికె నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయకుమార్ నాయుడు, వర్సిటీ కాలేజీ ప్రిన్సిపల్ సి.విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపల్ పివి.సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య సివి.కృష్ణారెడ్డి, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎన్.నరసింహులు, ఆర్.భరత్ కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రహదారి విస్తరణ బాధితులకు పూర్తి న్యాయం

- మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలో కొనసాగుతున్న రహదారి విస్తరణ పనుల్లో భూమి, భవనాలు కోల్పోయే బాధితులందరికీ పూర్తి స్థాయి న్యాయం చేస్తామని కమిషనర్ విశ్వనాథ్ తెలిపారు. నగరపాలక కార్యాలయంలో కిడ్స్ వరల్డ్ నుండి బుధవారపేట బ్రిడ్జి వరకు (ఆర్డీపి-2), చెక్‌పోస్ట్ నుండి ఎస్ఎస్ గార్డెన్స్ వరకు రహదారి విస్తరణ పురోగతిపై పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.కమిషనర్ మాట్లాడుతూ.. రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయడానికి అవసరమైన ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. బాధితులకు ట్రాఫిక్ నియంత్రణకు రహదారుల విస్తరణ ఆవశ్యకతను వివరించి, యాజమాన్య పత్రాలను తీసుకోవాలని ఆదేశించారు. నగరాభివద్ధికి ప్రజల సహకారం కీలకం కాబట్టి, స్వచ్ఛంద సహకారం అందిస్తే అభివద్ధి మరింత వేగవంతం అవుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఇంచార్జీ సిటి ప్లానర్ బి.వెంకటరమణ, పట్టణ ప్రణాళిక అధికారి అంజాద్ బాష, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో కచ్చితమైన ఎస్ఐఆర్

నియోజకవర్గంలో ఎస్ఐఆర్‌ను బూత్ స్థాయిలో కచ్చితంగా, ఎలాంటి తప్పుల్లేకుండా పూర్తి చేయాలని రిటర్నింగ్ అధికారి, నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సూచించారు. ఎస్‌బిఐ ఎంప్లాయీస్ కాలనీలోని నగరపాలక సమావేశ భవనంలో అసిస్టెంట్ ఆర్ఓలతో కలిసి బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్‌ను బూత్ స్థాయిలో అత్యంత జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. తహశీల్దార్ రవికుమార్, అదనపు ఎఇఆర్ఓలు ఆర్‌జివి.కృష్ణ, కెవి.సతీష్ కుమార్ రెడ్డి, పివి.శేష సాయి, డిప్యూటీ తహశీల్దార్ ధనుంజయ, సూపరింటెండెంట్ సుబ్బన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్

మొండి బకాయిలపై ఉదాసీనత తగదు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరాభివద్ధికి పన్నులే ప్రధాన ఆధారమని, వాటిని రాబట్టడంలో ఉదాసీనత వైఖరి తగదని నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో రెవెన్యూ విభాగ సిబ్బందితో పన్ను వసూళ్ల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నగరపాలకకు రూ.93 కోట్ల ఆస్తి పన్నులు, 14.78 కోట్ల తాగునీటి కొళాయి చార్జీల బకాయిలు రావాల్సి ఉన్నాయని, అందులో మొండి బకాయిలే అధికంగా ఉండటం సరైన పద్ధతి కాదన్నారు. వెంటనే మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేయాలని, ఇప్పటికే జారీ చేసిఉంటే దుకాణాలను సీజ్ చేయాలని ఆదేశించారు. నగరం ప్రగతి పథంలో నడవాలంటే పన్నులే కీలకమని, ప్రజలే స్వచ్ఛందంగా పన్నులను చెల్లించి నగరాభివద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఓలు జునైద్, స్వర్ణలత, వాజిద్, ఆలు, పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న కమిషనర్



మంత్రి లోకేష్‌ను కలిసిన బస్తిపాటి నాగరాజు

నారా లోకేష్‌ను కలిసిన ఎంపీ

ప్రజాశక్తి - కర్నూల్ క్రైమ్

ఢిల్లీలోని పార్లమెంటులోని టీడీపీ పార్లమెంటరీ కార్యాలయానికి వచ్చిన రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌ను కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్లమెంట్ సమావేశాలలో పాల్గొంటున్న ఎంపీ, మొంథా తుఫాను ప్రభావం వలన రాష్ట్రంలో జరిగిన నష్టం అంచనా సమగ్ర నివేదికను కేంద్ర మంత్రులు అమిత్ షా, శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అందించేందుకు వచ్చిన లోకేష్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ నాగరాజు జిల్లాలో మొంథా తుఫాను వల్ల కలిగిన నష్టాన్ని లోకేష్‌కి వివరించారు.

4న 'ఘంటసాల స్వరార్చన'

- స్వరాభిషేకం గాయకులు రాక

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

అమర గాయకుడు ఘంటసాల 13వ జయంతి పురస్కరించుకొని స్థానిక సి క్యాంప్ లోని టీ జీవి కళాక్షేత్రంలో ఈనెల 4న గురువారం సాయంత్రం ఘంటసాల స్వరార్చన పేరుతో సంగీత విభావరి నిర్వహించనున్నట్లు టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య, కార్యక్రమ కన్వీనర్ ఎస్ఎండి ఇనాయతుల్లా ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ సంగీత విభావరిలో హైదరాబాద్‌కు చెందిన స్వరాభిషేకం ఫేమ్ సుప్రసిద్ధ గాయకుడు మిత్ర పాల్గొననున్నారని తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన గాయని అఖిల, గాయకుడు శ్రీనివాసులు తదితరులు అలనాటి చిత్రాలలోని ఘంటసాల గీతాలను ఆలపిస్తారని అన్నారు. ముఖ్యఅతిథిగా మాజీ రాజ్యసభ సభ్యులు టిజీ వెంకటేష్ పాల్గొంటున్నారు. కర్నూలుకు చెందిన సుప్రసిద్ధ న్యూరో సర్జన్ డాక్టర్ సీతారాంకు పురస్కార సత్కారం చేయనున్నామని సంగీత అభిమానులు విశేష సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పత్తికొండ

డిసెంబర్ 31 నుండి జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు ఆల్ ఇండియా మహాసభలను జయప్రదం చేయాలని పిసి మాడలో ఆశ వర్కర్ల సమావేశంలో సిఐటియు మండల కార్యదర్శి ఎం.రవిచంద్ర, పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా మహాసభల పోస్టర్ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కనీస వేతనం తక్షణమే ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచుతామన్న మూడు వేల రూపాయలను వెంటనే పెంచాలన్నారు. ఆల్ ఇండియా మహాసభల్లో అన్ని రంగాల స్కీమ్ వర్కర్లు పాల్గొంటారని స్కీం వర్కర్లు సంఘటిత అసంఘటిత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో వక్తలు ప్రసంగిస్తారన్నారు. జనవరి 4న జరిగే మహా ప్రదర్శనలో స్కీం వర్కర్లు ఆశ వర్కర్లు అన్ని రంగాల కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



హార్మోన్ల అసమతుల్యత వల్ల సమస్యలు

- ప్రసూతి వైద్యులు రేష్మ

ప్రజాశక్తి - ఆదోని



హార్మోన్ల అసమతుల్యత వల్ల మహిళల్లో అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, అవగాహన కలిగి చికిత్స చేయించుకోవడం వల్ల ఆరోగ్యాన్ని మెరుగు పరచుకోవచ్చని ప్రసూతి వైద్యులు రేష్మ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఎస్‌కెడి కాలనీలో షాస నర్సింగ్ హోమ్‌లో పిసిఒఎస్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఓవేరియన్ సిండ్రోమ్ అనేది హార్మోన్ల అసమతుల్యత వల్ల వచ్చే ఒక సమస్య అని, ఇందులో అండాశయాలపై చిన్న తిత్తులు ఏర్పడతాయని తెలిపారు. క్రమరహిత రుతుచక్రం, అధిక ఆండ్రోజెన్ స్థాయి, ఇన్సులిన్ నిరోధకత వంటి లక్షణాలు ఉంటాయన్నారు. ఈ సమస్యను అర్థం చేసుకోవడానికి అవగాహన పెంచుకోవడం ముఖ్యమని తెలిపారు. దీనికి జీవనశైలి మార్పులు, ఆహారం, వ్యాయామం సహాయపడతాయన్నారు.

పిసిఒఎస్ అంటే ఏమిటి..?

హార్మోన్ల మార్పుల వల్ల కలిగే సమస్యగా పిసిఒఎస్‌ను పరిగణిస్తామని తెలిపారు. అండాశయాల్లో సరిగా అభివృద్ధి చెందని ఫోలికల్స్ (గుడ్లు ఉండే సంచులు) ఏర్పడతాయని, ఇవి అండోత్సర్గము (ఒవులేషన్) జరగకుండా ఆపుతాయని చెప్పారు.

పిసిఒఎస్ లక్షణాలు

క్రమరహిత రుతుచక్రం, మొటిమలు, హిర్సూటిజం, బరువు పెరగడం, అలోపేసియా (జుట్టు రాలడం) వంటి లక్షణాలు బహిర్గతం అవుతాయన్నారు.

జీవనశైలి మార్పులు

బరువు తగ్గడం, ఆహారం, వ్యాయామం వంటివి చాలా ముఖ్యమని తెలిపారు. ప్రాసెస్ చేసిన కార్బోహైడ్రేట్లు, చక్కెర తగ్గించి, ఫైబర్, ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్న ఆహారాలు (బ్రౌన్ రైస్, ఓట్స్) సహాయపడతాయన్నారు.

వ్యాయామం

వారానికి కనీసం ఐదు రోజులు, 20 నిమిషాల పాటు మితమైన వ్యాయామం చేయడం వల్ల బరువు తగ్గడమే కాకుండా అండోత్సర్గం, ఇన్సులిన్ స్థాయి మెరుగుపడతాయన్నారు.

వైద్య చికిత్స : అవసరమైతే, వైద్యుల పర్యవేక్షణలో చికిత్సలు చేయించుకుని అందుబాటులో ఉన్న మందులను వాడాలన్నారు. సంతానం కలగని వారికి కూడా ఆధునిక టెక్నాలజీతో సంతాన సాఫల్యం తమ ఆస్పత్రిలో అందుబాటులో ఉందన్నారు.



దాడి కేసులో నిందితునికి జైలు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

మహిళపై దాడి చేసిన కేసులో నిందితులకు ఏడాది శిక్షతోపాటు రూ.3 వేల జరిమానా విధించినట్లు మూడో పట్టణ సిఐ శేషయ్య మంగళవారం తెలిపారు. కర్నూలు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉప్పరి లక్ష్మీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పిడతల వెంకటస్వామి, పిడతల లక్ష్మీదేవిపై గతంలో కేసు నమోదయింది. డీఎస్పీ జె.బాబు ప్రసాద్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. కర్నూలు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో విచారణలో నేరం రుజువయింది. కేసు పూర్వాపరాలను విచారించిన జడ్జి అనిల్ కుమార్ నిందితులకు ఒక సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో శిక్ష పడటానికి ఏపీపీ గోపాలకృష్ణ సమర్థవంతంగా వాదనలు వినిపించి సాక్ష్యాలను నిరూపించడంలో కీలకపాత్ర పోషించారు. విచారణ త్వరగా జరగడానికి సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టిన కానిస్టేబుళ్లు తిక్క స్వామి, జాన్సన్‌ను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ప్రత్యేకంగా అభినందించారు.

నేడు వెల్దుర్తికి ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - వెల్దుర్తి

వెల్దుర్తికి బుధవారం పత్తికొండ ఎమ్మెల్యే కెఈ శ్యాంబాబు రానున్నారు. స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎక్సరే మిషన్‌ను ప్రారంభించనున్నట్లు ప్రభుత్వ వైద్య అధికారులు తెలిపారు. నూతన ఎక్సరే సౌకర్యం అందుబాటులోకి రావడంతో రోగులకు పరీక్షలు చేయించుకునే సౌకర్యం అందుబాటులోకి రానుంది.

మాట్లాడుతున్న సభ్యులు



హై రిస్క్ గర్భిణులకు ప్రత్యేక చికిత్స

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

హై రిస్క్ గర్భిణులకు ప్రత్యేక చికిత్స అందజేస్తున్నట్లు వైద్యులు డాక్టర్ సుప్రియ పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్ మండలంలోని హుస్సేనాపురం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశాడే నిర్వహించారు. డాక్టర్ సుప్రియ, సంచార చికిత్స కార్యక్రమాల కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు పాల్గొన్నారు. ప్రసవాలను ప్రభుత్వాస్పత్రిలోనే జరిగేలా చూడాలని ఆశాలను కోరారు. గర్భిణుల ఆరోగ్య పరిరక్షణపై నిరంతరం పర్యవేక్షణ చేయాలన్నారు.

కర్నూలు హాస్పిటల్ : యుపిహెచ్‌సి ఎర్రబురుజులో నిర్వహించిన ఆశా డే సమీక్షలో జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ ఉమా పాల్గొని మాట్లాడారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజశ్రీ, డిసిఎం ప్రసాద్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

డిసెంబర్ 31 నుండి జనవరి 5 వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం ఓర్వకల్లు మండలంలోని నన్నూరు గ్రామంలో ఆశా వర్కర్ల సమావేశం నిర్వహించారు. ఎం.గోపాల్ తో పాటు మండల దీక్ష ప్రధాన కార్యదర్శులు షాజహాన్ శ్రీధర్లు పాల్గొని మాట్లాడుతూ ఆశ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. స్కీం వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. జనవరి 4వ తేదీన లక్ష మందితో జరిగే విశాఖపట్నంలో సిఐటి యుబహిరంగ సభకు పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు.

ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాలో 166 ఎడ్యుకేషన్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సామ్యూల్ పాల్ మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీలోగా తమ దరఖాస్తులను సంబంధిత ఎంఈఓ కార్యాలయాల్లో అందజేయాలని డీఈవో పేర్కొన్నారు.

ఎర్రమట్టి అక్రమంగా తరలిస్తే చర్యలు

- మైనింగ్ శాఖాధికారులు

ప్రజాశక్తి - సిబెళగల్

ఎర్రమట్టిని అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని మైనింగ్ శాఖ డిడి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మంగళవారం కంబదహాల్ గుట్టల్లో ఎర్రమట్టి అక్రమ రవాణా జరిగినట్లు తెలుసుకొని తహశీల్దార్ వెంకట లక్ష్మి సమక్షంలో తనిఖీలు చేపట్టారు. అవసరమైన మట్టి కోసం అనుమతులు తప్పనిసరిగా పొందాలని ప్రజలకు తెలిపారు. సహజ సంపద ఎర్రమట్టిని, ఇసుకను, గనులను కాపాడుకోవడం అందరి బాధ్యత అని చెప్పారు. ఎస్ఐ వేణుగోపాల్ రాజు, ఆర్ఐ తరుణ్, విఆర్ఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పెండింగ్ గృహాలను పూర్తి చేసుకోవాలి

- హౌసింగ్ పీడీ చిరంజీవి

ప్రజాశక్తి - వెల్దుర్తి



మండలంలోని పంచాయతీల్లో పెండింగ్‌లో ఉన్న దాదాపు 300 గృహాలను 2026 మార్చిలోపు పూర్తి చేసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవి తెలిపారు. మంగళవారం పట్టణంలోని లబ్ధిదారుల ఇంటికి వెళ్లి మార్చిలోపు పెండింగ్ గృహాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. అధికారులు బాలకృష్ణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గిడ్డప్ప పాల్గొన్నారు.

అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

బిఈడి కళాశాలల అవినీతి అక్రమాలపై విచారణ చేయాలని రాయలసీమ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బందెల ఓబులేసు, డెమోక్రటిక్ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రియాజ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాయలసీమ వర్సిటీ రిజిస్ట్రార్ బి విజయకుమార్ నాయుడును కలిసి వినతి పత్రం అందజేశారు. బీఈడీ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందేలా చూడాలని కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి : వ్యకాస

ప్రజాశక్తి - పత్తికొండ

ఉపాధి కూలీలకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని వ్యకాస మండల కార్యదర్శి నరసన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఎంపిడిఓ కార్యాలయంలో వ్యకాస మండల అధ్యక్షులు నరసన్న, సహాయ కార్యదర్శి శిఖామణి ఎంపిడిఓ కవిత రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... అధిక వర్షాల వల్ల పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక సుదూర ప్రాంతాలకు రైతులు వలసలు వెళ్తున్నారని, తక్షణమే పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధి కూలీలను కలుపుకొని ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



మాట్లాడుతున్న నాయకులు

బెట్టింగ్, మట్కా, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపాలి: ఎఐవైఎఫ్

ప్రజాశక్తి -కోడుమూరు

కోడుమూరు మండలంలో అత్యంత రహస్యంగా జరుగుతున్న బెట్టింగ్, మట్కా, గంజాయిపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని ఒక ప్రైవేట్ కళాశాలలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు గౌడ్ పిలుపునిచ్చారు. మండలంలో అనేకమంది యువత చెడు అలవాట్లకు బానిసలుగా తయారై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని వారి పట్ల ఎప్పటికప్పుడు తల్లితండ్రులు గమనిస్తూ ఉండాలని, ఎటువంటి అనుమానం వచ్చిన వెంటనే వారికి కౌన్సిలింగ్ ఇచ్చి సరైన మార్గంలో నడిచే విధంగా చూసుకోవాలని, ఇది ఎక్కువగా ఇంజనీరింగ్,మెడికల్ కళాశాల విద్యార్థులను టార్గెట్ చేసుకొని గంజాయి ముఠాలు విస్తరిస్తున్నారని అటువంటి వారిపై పోలీసులు అవగాహన సదస్సులు నిర్వహించి, మితిమిరిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ నాయకులు మునిస్వామి, అఖిల్, హరి, తరుణ్, కళదర్, ఆంజనేయులు, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరం

- సాఫ్ట్ స్కిల్ ట్రైనర్ మాస్టర్ మోటివేటర్ గౌతమి

ప్రజాశక్తి - ఆదోని

విద్యార్థుల్లో నేర్చుకోవాలన్న పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరమని సాఫ్ట్‌స్కిల్ ట్రైనర్ మాస్టర్ మోటివేటర్ గౌతమి తెలిపారు. మంగళవారం పట్టణంలోని నేషనల్, జిఎస్ఆర్ విద్యాసంస్థల్లో 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని, వాటిని చేరుకోవడానికి ప్రణాళిక వేసుకోవాలని తెలిపారు. అప్పుడే విజయం సాధిస్తారన్నారు. విజయవంతమైన వ్యక్తుల జీవితాలను ప్రేరణగా తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు సత్యశ్రీ, వెంకటేష్, ఖాదర్, విజయ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న గౌతమి